క్లుప్తంగా

విరాళం అందజేత

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ పుప్పాలగుట్టలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి లోకలపూరి సురేందర్, రాజేశ్వరి దంపతుల కుమారుడు అనికేత్ రూ. 1,01,000 నగదును మంగళవారం ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అనికేత్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎల్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతతో అంగన్ వాడీలకు సంబంధం లేదు

హన్మకొండ: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే అంగన్‌వాడీల జీపుజాతాకు టీఎన్జీఓస్ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ యూనియన్ జిల్లా నాయకులు పి.సరస్వతి, హైమావతి, స్వప్న, సుగుణ, ప్రసన్న, సుష్మచంద్ర తెలిపారు. ఈ జీపుజాతాలో టీఎన్జీఓస్ యూనియన్ అనుబంధ అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొనవద్దని వారు ఒక ప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రాంనగర్, క్రాంతినగర్, స్కాలర్స్ స్కూల్, భువనేశ్వరి మాత దేవాలయం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఎక్సైజ్ కాలనీ రైతుబజార్, అలీపుర, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

సీఎంను కలిసిన మేయర్



వరంగల్ అర్బన్ : మహారాష్ట్ర షోలాపూర్‌లోని పండరీపురంలో సీఎం కేసీఆర్‌ను వరంగల్ నగరమేయర్, బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బహిరంగ సభలో మహిళా మంత్రులు, మేయర్ల బృందం, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పాఠశాలలో పఠనోత్సవం

మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం పఠనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్.ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. చదువుతున్న పాఠ్యాంశంపై ఇష్టంతో చదువుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీక్షను జయప్రదం చేయాలి

వరంగల్ చౌరస్తా : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఉదయం 10 గంటలకు ఏకశిలా పార్కు వద్ద జరిగే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర ప్ర. దాన కార్యదర్శి గడ్డం నాగార్జున కోరారు. విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఖాళీ 'సదనం'..!

- బాలసదనంలో ఉద్యోగులు, బాలికలు లేని వైనం
- కన్పించని ఈఓ, సిబ్బంది
- నిరుపయోగంగానే.. ప్రైవేట్ అద్దె భవనం



సాక్షి, వరంగల్: నిరాశ్రయులైన బాలికలకు అవాసం కల్పించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పేందుకు అలవాలమైన 'బాలసదనం' బావురుమంటోంది.18 ఏళ్లలోపు బాలికల కోసం జిల్లాలోని గీసుగొండ మండలం ధర్మారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కూతవేటు దూరంలో అద్దెకు తీసుకున్న 20 గదులున్న భవనం ఇటు ఉద్యోగులు, అటు బాలికలు లేక ఖాళీగా దర్శనమిస్తోంది. ఈ భవనానికి నెలకు రూ.24,667 చెల్లించేలా గతేడాది ఫిబ్రవరి 26న జిల్లా కలెక్టర్‌కు మహిళ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులివ్వడంతో జిల్లా విభాగాధికారులు ఆ భవనానికి అద్దె చెల్లిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం నుంచి పోషణ అభియాన్‌లో పనిచేసిన కౌన్సిలర్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్లను ఈ బాలసదనంలో పనిచేసేందుకు తీసుకున్నా.. అక్కడ మాత్రం విధులు నిర్వహించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలోనే ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలకు సంబంధించిన దరఖాస్తుల కంప్యూటరీకరణ పనులు చేయడంతోపాటు అక్కడి ఉద్యోగులకు చేదోడు వాదోడుగా ఆడుతూ పాడుతూ పనిచేస్తున్నారన్న విమర్శలున్నాయి. వీరితోపాటు బాలసదనం కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఈఓ) కూడా వచ్చినా ఆ భవనంలో ఇప్పటివరకు బాలికలకు సంరక్షణ కల్పించలేదని వినికిడి.

ప్రజాధనం వృథా..?

ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఈఓలకు కలిపి దాదాపు నెలకు రూ.లక్షపైన వేతనాలు వెళ్తుండడం .. ఆ భవనానికి నెలకు రూ.24,667 చెల్లిస్తుండడంతో బాలసదనం ఉద్దేశం నీరుగారుతోంది. దాదాపు 15 నెలల్లో రూ.3.70లక్షల వరకు అద్దె చెల్లింపు విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ సొమ్ము వృథా అవుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ బాలసదనం కార్యకలాపాల గురించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

గ్రూప్-4 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స

కరీమాబాద్: జిల్లాలో జూలై 1వ తేదీన నిర్వహించనున్న గ్రూప్ 4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణకు సంబంధించి రెవెన్యూ, పోలీస్, మెడికల్, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ, రవాణా, విద్యాశాఖ అధికారులతోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి, సిబ్బందికి మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 76 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నర్సంపేటలో 25, వరంగల్‌లో 51 సెంటర్లలో 29,819 మంది అభ్యర్థులు (170 మంది ఉర్దూ, మిగతా 29,649 తెలుగు, ఇంగ్లిష్ మీడియం) పరీక్షలకు హాజరవుతారని వివరించారు. సమావేశంలో డీసీపీ కరుణాకర్, నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు, వరంగల్, నర్సంపేట ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిని పార్టీనుంచి సస్పెండ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లెబోయిన అశోక్

హన్మకొండ అర్బన్ : ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని ముదిరాజ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ అర్బన్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బయ్యు స్వామి, పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో నగరంలోని హంటర్‌రోడ్డులో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండాల మదన్‌కుమార్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా మత్స్య శాఖ చైర్మన్ బుస్సా మల్లేశం, దినేష్‌కుమార్, వరంగల్ జి ల్లా అధ్యక్ష, కార్యదర్శి పొన్నం మొగిలి, చొప్పరి సోమయ్య, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిల్లా సహదేవ్, రాజ్‌కుమార్, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు చేపట్టండి



బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

వరంగల్ అర్బన్ : హంటర్ రోడ్డులోని సాయినగర్, బృందావన కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీల ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే వరద ముంపుతో రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నారని ముందస్తు చర్యలు చేపట్టాలని భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అభివృద్ధి సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బొందివాగు నాలా నుంచి రామన్నపేట రోడ్డులోని 12 మోరీల వరకు యుద్ధప్రతిపాదికన కచ్చా కాలువ తీసి పై కాలనీలు ముంపు గురికాకుండా చూడాలని కోరారు. భద్రకాళి బండ్‌కు సమీపంలో కాలనీల్లోని భవనాలను సుప్రీంకోర్టు రూల్స్ ప్రకారం హైదరాబాద్ తరహాలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ ద్వారా విచారణ చేపట్టాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అభివృద్ధి సమితి అధ్యక్షుడు రవీందర్, ప్రతినిధులు జితేందర్, రమేష్, వలబోజు శ్రీనాథ్ ఉన్నారు.

బొడ్రాయి పేరుతో రాజకీయం సహించం

రామన్నపేట : నగరంలోని కొత్తవాడలో బొడ్రాయి పేరుతో చేసే రాజకీయాన్ని తాము సహించమని వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఫంక్షన్‌హాల్‌లో పద్మశాలి, బాలాజీ సంఘం, ఆటోనగర్ ప్రాంతాల్లో వివిధ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్, 23వ డివిజన్ బీజేపీ యువనాయకులు ఆడెపు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. డివిజన్ బొడ్రాయి స్థాపన స్థానిక కార్పొరేటర్‌కు తెలుపకుండా మెజారిటీ ప్రజలు వ్యతిరేకిస్తున్న తన స్వార్థం కోసం ప్రజలను అయోమయంలో పడేస్తున్న యెలగం సత్యనారాయణ మాటలు ఎవరు నమ్మవద్దన్నారు.కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతిని ధులు చిప్ప వెంకటేశ్వర్లు, నీలం రాజ్‌కిశోర్, దామె ర సర్వేశ్, మధునయ్య శాస్త్రి, రుద్ర వీరభద్రయ్య, సతీష్, పిట్ట రాములు, పాల్గొన్నారు.

విద్యాశాఖలో స్వచ్ఛంద సంస్థల ప్రమేయం సరికాదు

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు అమలుతీరు తనిఖీల్లో భాగంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయటం విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనమని గవర్నమెంటు టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు జి వెంకటేశం, టి ప్రకాశ్‌గౌడ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల సేవలను పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, అవసరమయ్యే సామగ్రి కోసం వినియోగించుకోవాలే కానీ అకాడమిక్ వ్యవహారాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు తనిఖీలకు భాగస్వాములుగా అవకాశం కల్పించటం సరికాదన్నారు. ఆయా ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సంతాపం

హన్మకొండ : మాజీ రాజ్యసభ మాజీ సభ్యుడు, భారత చైనా మిత్రమండలి జాతీయ నాయకుడు సోలిపేట రాంచంద్రారెడ్డి మృతిపై ఓపీడీఆర్ సంతాపం ప్రకటించింది. అధికార రాజకీయాల్లో ఉంటూ అత్యున్నతమైన రాజకీయ, మానవీయ విలువలకు కట్టుబడి ఆదర్శవంతమైన జీవితం గడిపిన నాయకుడు రాంచంద్రారెడ్డి అని ఓపీడీఆర్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జతిన్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.విజయేందర్ కొనియాడారు. నాయకులు ఇల్లందుల శోభన్‌బాబు, మోహన్‌రెడ్డి రాంచంద్రారెడ్డి మృతికి సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైల్వే ఇనిస్టిట్యూట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ ప్రాంగణంలో మంగళవారం ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో ఆజాది కా అమృత్ మహోత్సవ్ -2వ విడుతలో భాగంగా రైల్వే కార్మిక, రిటైర్డ్ కటుంబాల పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన పలు రకాల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందరికి ప్రదానం చేశారు. బహుమతులు పొందిన పిల్లలను కమిటీ సెక్రటరి దేవుల పల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య అభినందించారు. కమిటీ ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, ప్రశాంత్, రఘు, మాధవరావు, రవికిరణ్, సాయిరాజ్, దేవిప్రసాద్, పాల్గొన్నారు.

అడ్తి లైసెన్సుల కోసం వ్యాపారుల నిరసన



మార్కెట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు అడ్తి(కమీషన్) లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది గడుస్తున్నా ఇవ్వడం లేదని దరఖాస్తు దారులు 54 మంది మంగళవారం మార్కెట్ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. దీంతో మార్కెట్ పాలకవర్గం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సోమవారం వరకు లైసెన్సులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

ఇవ్వద్దని ఆదేశాలు ఉన్నా...

వరంగల్ మార్కెట్ కమిటీ పరిధిలో కొత్త అడ్తి(కమీషన్) లైసెన్సులు ఇవ్వద్దని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ స్పష్టమైన అదేశాలు ఉన్నప్పటికీ మార్కెట్ అధికారులు ఎందుకు దరఖాస్తులు తీసుకున్నారన్న విషయం అర్థం కాని ప్రశ్న. ఇప్పటికే మార్కెట్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు జారీ చేయడంతో రాష్ట్ర అధికారులు కొత్త లైసెన్సులు ఇవ్వద్దన్న ఆంక్షలు పెట్టినట్లు సమాచారం.

అందరి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం

- సిక్స్‌మెన్ కమిటీ
- డెస్క్ జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న సిక్స్‌మెన్ కమిటీ సభ్యులు, డెస్క్ జర్నలిస్టులు

నయీంనగర్ : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో అందరి సూచనలు పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తామని సిక్స్‌మెన్ కమిటీ హామీ ఇచ్చింది. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇళ్ల స్థలాల గురించి చర్చించేందుకు మంగళవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో డెస్క్, ఫొటో, వీడియో జర్నలిస్టులతో సిక్స్‌మెన్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కమిటీ సమన్వయకర్త టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, టీయుడబ్ల్యూజే(ఐజేయూ) హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, టీయుడబ్ల్యూజే(143) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య హాజరయ్యారు. సమావేశంలో ఇళ్ల స్థలాల విషయంలో జర్నలిస్టులకు ఉన్న అనుమానాలను సిక్స్‌మెన్ కమిటీని అడిగి నివృత్తి చేసుకున్నారు. అందరూ డెస్క్‌వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు వచ్చేలా చూడాలని డెస్క్ జర్నలిస్టులు కమిటీని కోరారు. పలువురు సభ్యులు అక్రిడిటేషన్ లేకుండా పనిచేస్తున్న వారిని కూడా హౌజింగ్ లిస్ట్‌లో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో సాక్షి, నమస్తే తెలంగాణ ఎడిషన్ ఇన్‌చార్జ్‌లు వర్దెల్లి లింగయ్య, రమేశ్, పలువురు సీనియర్ డెస్క్ ఇన్‌చార్జ్‌లు,ప్రెస్‌క్లబ్ కోశాధికారి బి.అమర్, జాయింట్ సెక్రటరీ పెద్దపల్లి వరప్రసాద్, డెస్క్ జర్నలిస్టులు, ఫొటో,వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూఎస్ఎఫ్ఐ బాధ్యులు

విద్యారణ్యపురి : జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలల జాబితాను కూడా ప్రకటించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైని కలిసి వినతిపత్రంను సమర్పించారు. అలాగే మరికొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఒక క్యాంపస్‌కు అనుమతి తీసుకొని వేరేచోట పలు బ్రాంచీలు నడుపుతున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో యూఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ హరీష్, జిల్లా నాయకులు ప్రశాంత్, శ్రీనాథ్, రామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగికి, రక్తదాతకు వారధి యూ బ్లడ్ యాప్



యూ బ్లడ్ యాప్ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ అనిత, డాక్టర్ ప్రణదీప్

హన్మకొండ: ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి, రక్తదాతకు యూ బ్లడ్ యాప్ వారధిగా పని చేస్తుందని ప్రముఖ సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం హనుమకొండ నయీంనగర్‌లోని లక్ష్మీనరసింహ హాస్పిటల్‌లో యూ బ్లడ్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యూ బ్లడ్‌యాప్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యూ బ్లడ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యూ బ్లడ్ యాప్ బ్రోచర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ అనిత, సీనియర్ సర్జన్ డాక్టర్ ప్రణదీప్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్‌సుల్తానా డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, స్కూల్‌యూనిఫామ్స్ రాలేదన్నారు. మన ఊరు మనబడి పేరుతో ఇంకా వివిధ పాఠశాలల్లో సగం వరకే పనులు పూర్తయ్యాయని ఇంకా పనులు మిగిలిపోయాయన్నారు. పాఠశాలల్లో క్రీడల కోసం స్పోర్ట్స్ కిట్స్‌ను కూడా అందించటం లేదన్నారు.


విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి



టెన్త్ టాపర్స్‌కు బ్యాగులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కాశిబుగ్గ : శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ (1995-96) విద్యార్థులు సూచించారు. మంగళవారం పూర్వ విద్యార్థులు సింగిరెడ్డి యాదగిరి, డాక్టర్ సింగారపు విజయ్‌కుమార్, బాల్య సునీల్ 2023 పది ఫలితాల్లో పాఠశాలలో 8 జీపీఏ కంటే ఎక్కువ సాధించిన 13 మంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుని పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని సూచించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మ దహనం



విద్యారణ్యపురి : జిల్లాల్లో విద్యాసంస్థల్లో విద్యార్థుల నుంచి అక్రమంగా విచ్చలవిడిగా ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక మొత్తంలో ఫీజుల దోపిడీ చేయడాన్ని నిరాసిస్తూ హనుమకొండలోని కేడీసీ ఎదుట మంగళవారం ప్రైవేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మని దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏబీఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యారంగాన్ని వ్యాపారంగా మలుచుకొని విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న కానీ విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు మధుగౌడ్, పవన్, వినయ్, సాయికిరణ్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఎంపికలు

కాశిబుగ్గ: రాష్ట్రంలోని హకీంపేట, మేడ్చల్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్స్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు మండల, జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల ఆధికారి ఎస్.ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతి పాసై 4వ తరగతి చదువుతున్న బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఆయా మండలాల ఎంఈఓలు ఇన్‌చార్జ్‌లుగా జూలై 1 నుంచి 5 వరకు అయా మండలాల్లోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు పాఠశాల హెచ్ఎంలతో ధ్రువీకరించబడిన స్టడీ, బర్త్, క్యాస్ట్ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డ్, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటల కల్లా వరంగల్ ఓ సిటీ స్టేడియానికి రావాలని సూచించారు. జూలై 13న వరంగల్, ఖిలావరంగల్, గీసుకొండ, సంగెం మండలాలలకు జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయని వెల్లడించారు.

సంక్షిప్త సమాచారం

3న గురుపౌర్ణమి వేడుకలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని శ్రీసద్గురు శివానందమూర్తి సప్త గురుధామంలో జులై 3న గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు శివానంద గురుకల్చర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు.

రైతులకు పరిహారం ఏది?

వరంగల్: గత మార్చి నెల 16 నుంచి 22 వరకు కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు నష్టపరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇప్పటి వరకు రైతులకు అందలేదని అఖిలభారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

'బీరన్న బోనాల'ను విజయవంతం చేయాలి

కరీమాబాద్: కురుమల ఆరాధ్యదైవమైన బీరన్న బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉర్సు బీరన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఆలయంలో మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా తొలిఏకాదశి రోజున బీరన్న స్వామికి కురుమ కులస్తులు బోనాలు సమర్పించడం వందల ఏళ్లుగా ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగా గురువారం ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో యేర కోటేశ్వర్, నీల యాకయ్య, అన్న కుమారస్వామి, మండల ప్రమీల, కొరె అయిలయ్య, మిరియాల కుమారస్వామి, చీర రాజు, కొలుపుల కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఐఐహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'పాపుశెట్టి'



ఎంజీఎం : ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హో మియోపతి (ఐఐహెచ్‌పీ) ఫిజీషియన్స్ ఉపాధ్యక్షుడిగా హన్మకొండకు చెందిన డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ ఎంపికయ్యారు. హైదరాబాద్ రామంతపూర్‌లో జరిగిన సెమినార్‌లో జాతీయ అధ్యక్షులు డాక్టర్ తన్వీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఎస్‌పి. శివరామమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే హన్మకొండ ఐఐహెచ్‌పీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సుధాకర్‌రావు, అ.ధ్యక్షులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కమల్ కిశోర్, రేవతి, జనరల్ సెక్రటరీగా రాంబా బు, జాయింట్ సెక్రటరీగా వివి.రెడ్డి, ట్రెజరర్‌గా బాసాని శ్రీకాంత్, ఈసీ మెంబర్‌లుగా మా ధవరా వు, మంజుల, లక్ష్మి, కీర్తి, సాయికృష్ణ ఎన్నికయ్యారు.

'నా మేరా బూత్ సబ్‌సే మజ్బూత్'లో బీజేపీ నేతలు

వరంగల్: నా మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త నా బూత్ మొదటి స్థానంలో ఉండాలన్న దృఢనిశ్చయంతో పనిచేయాలని పిలుపునిచ్చినట్లు వరంగల్ తూర్పు బీజేపీ నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ తెలిపారు. మంగళవారం దేశ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఏర్పాటు చేసిన మేరా బూత్ సబ్సే మజ్బూత్‌లో ప్రధానీ సందేశాన్ని వీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగాని జగదీశ్వర్, జిల్లా కార్యదర్శి ముంద్రాతి వెంకటేశ్వర్లు, 13, 19వ డివిజన్ల అధ్యక్షులు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాపీ మేస్త్రీ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మామునూరు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..వరంగల్ ఎనుమాముల గ్రామానికి చెందిన గుగులోతు రాములు (62) తాపీమేస్త్రీ పని చేస్తూకుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాములు ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం రోడ్డుపై వెలిసిన గుడిసెల్లో అతను ఒక గుడిసె వేసుకున్నాడు. ప్రతి రోజు తిమ్మాపురం గుడిసెల వద్దకు సోమవారం సాయంత్రం బైక్‌పై వస్తున్న క్రమంలో తిమ్మాపురం క్రాస్‌రోడ్డు వద్ద టాటాఏస్ వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్ పై నుంచి రాములు రోడ్డుపై పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

హన్మకొండ : వానాకాలం పెట్టుబడికి రైతుబంధు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మంగళవారం హనుమకొండ హనుమాన్‌నగర్-1లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదం

కాజీపేట అర్బన్ : విద్యార్థులకు క్రమశిక్షణకు ఎన్‌సీసీ దోహదపడుతుందని మైనారిటీ గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎండీ.అబిద్ తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండలోని బాయ్స్ మైనారిటీ గురుకుల పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ కేడెట్లకు ఏ-సర్టిఫికెట్లను అబిద్ అందజేసి మాట్లాడారు. రెండేళ్ల ఎన్‌సీసీ శిక్షణలో విద్యార్థులు క్రమశిక్షణ, డ్రిల్, వెపెన్ ఫైరింగ్, మ్యాప్రోడింగ్, శారీరక, మానసిక వికాసం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ రామకోటి, ఆర్మీ అధికారి భరత్, విజిలెన్స్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ వేగవంతం చేయాలని కోరుతూ కేయూ కాంట్రాక్ట్ అధ్యాపక జేఏసీ నాయకులు మంగళవారం హనుమకొండలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయించాలని ఆయనతో చర్చించారు. సీఎం కేసీఆర్‌ను త మను కల్పించాలని కూడా విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) ఆధ్వర్యంలో మంగళవారం కేయూ మొదటి గేట్ వద్ద ధర్నా చేశారు.